భూకబ్జాలకు అడ్డుకట్టేది?


బ్రహ్మంగారిమఠంలో ఆక్రమణకు గురైన శ్మశానవాటిక భూములు

- ఈనాడు, కడప, న్యూస్‌టుడే, బద్వేలు

గత అయిదేళ్ల వైకాపా పాలనలో జిల్లాలో భూకబ్జాలకు అంతే లేకుండా పోయింది. ప్రధానంగా బద్వేలు నియోజకవర్గంలో సాగిన భూ ఆక్రమణదారులపై చర్యలు చేపట్టి, బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత కలెక్టర్ శివశంకర్‌తోపాటు బద్వేలు నూతన ఆర్డీవో చంద్రమోహన్‌పై ఉంది. నియోజకవర్గంలో భారీఎత్తున ఆక్రమణలు సాగాయి. న్యాయం కోసం బాధితులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఎన్డీయే ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందని ఎంతోమంది ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇలాంటి తరుణంలో గత తప్పిదాలను పరిష్కరించలేని పరిస్థితిలో భూసమస్యలు పునరావృతమవుతుండడం గమనార్హం.

మారని అక్రమార్కుల వ్యవహార శైలి

ఉన్నతాధికారుల చర్యలతోనే మోక్షం

బి.మఠంలో శ్మశానవాటిక ఆక్రమణ

బ్రహ్మంగారిమఠంలో శ్మశాన వాటికను సైతం వైకాపా నేతలు వదిలిపెట్టలేదు. సర్వే నంబరు 464లో 10.05 ఎకరాల భూమిలో శ్మశానవాటిక ఉండగా, దొంగ పత్రాలు సృష్టించి 8 ఎకరాలు కబ్జా చేసి సాగు చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాత దస్త్రాల్లో అడంగల్‌లో 19వ పసలీలో ప్రభుత్వ భూమిలో వైకాపా నేతల పేర్లు కనిపిస్తున్నాయి. అంతకు ముందు అందుబాటులో ఉన్న రికార్డుల మేరకు 14 నుంచి 17వ పసలీ వరకు అడంగల్‌లో 464 సర్వే నంబరులో 10.5 ఎకరాల భూమి శ్మశానంగా ఉంది. 18వ పసలీలో అనుభవదారుల కింద వైకాపా నేతల పేర్లు చేరాయి. 464 సర్వే నంబరులోని భూమిని మూడు భాగాలుగా విభజించి 4.5 ఎకరాలను మాత్రం శ్మశానం కింద ఉంచి మిగిలిన ఆరెకరాలను వైకాపా నేతల పేరిట బదలాయించారు.

వైకాపా నేతల పేరిటే పాఠశాల స్థలం

బద్వేలు నియోజకవర్గంలో రెవెన్యూ కార్యాలయాల వేదికగా అక్రమాలు జరుగుతున్నాయి. ఇక్కడ స్థలాలకు గిరాకీ పెరగడంతో బద్వేలు కేంద్రంగా నకిలీ పట్టాలు, పత్రాలకు అక్రమార్కులు తెరలేపారు. 2010లో నకిలీ పత్రాల తయారీ గుట్టును రట్టు చేసి రెవెన్యూ సిబ్బందితో పాటు తయారీ ముఠాపై అప్పటి తహసీల్దారు వినాయకం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2021లో నకిలీ పట్టాల తయారీపై బద్వేలు ఆర్డీవో వెంకటరమణ ఉక్కుపాదం మోపారు. సూత్రదారి పిల్లి భాస్కర్‌తో పాటు 20 మందిపై పోలీసులకు ఫిర్యాదు చేసి నకిలీ పత్రాలు, కార్యాలయాల సీళ్ల స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఆరుగురిని అరెస్టు చేసి మిగిలిన వారిని వదిలేశారు. ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగితో లాలూచి పడి పెద్ద ఎత్తున నకిలీ పత్రాలు తయారు చేశారనే ఆరోపణలున్నాయి. ఈ కేసు వైకాపా పెద్దల జోక్యంతో నీరుగారిపోయింది. నకిలీ పత్రాలు తాజాగానూ పుట్టుకురావడంతో భూముల యజమానులు బాధితులుగా మారుతున్నారు. బి.కోడూరు మండలం గోవిందాయపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను వైకాపా నేతలకు ఇటీవల పట్టా చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ పాఠశాల మంగళవారం నాటికి కూడా వైకాపా నేతల పేరిటే ఉండడం గమనార్హం.

బాధితుల కన్నీటి గాథ

సింహాద్రిపురం మండలం హిమకుంట్ల గ్రామానికి చెందిన రేనాటి నాగలక్ష్మమ్మకు 13 ఎకరాల పొలం ఉండగా.. దీన్ని వీఆర్వో, వీఆర్ఏ కలిసి తమ కుటుంబ సభ్యుల పేరిట నమోదు చేసుకున్నట్లు కలెక్టర్ శివశంకర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. తమ గోడు వినిపించుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. తాతముత్తాతల కాలం నుంచి అనుభవంలో ఉన్న భూమిని రెవెన్యూ సిబ్బంది కుట్రతో కాజేశారని ఆధారాలతో సహా కలెక్టర్‌కు సమర్పించారు. ఆక్రమణదారుల నుంచి తమకు భూమి ఇప్పించాలని కుటుంబ వారసుడు రేనాటి శ్రీనివాసులు వేడుకుంటున్నారు.

3 నుంచి దసరా ఉత్సవాలు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో దసరా ఉత్సవాలను ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్యసభ పట్టణాధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు తెలిపారు. 3న రాజరాజేశ్వరీదేవి అలంకరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. 8వ తేదీ పాలకొల్లు బ్యాండ్, పులి, దిల్లీల నుంచి కళాకారుల బృందంతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం దసరా మహోత్సవాల ఆహ్వాన పుస్తకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ ఉపాధ్యక్షుడు రవీంద్రబాబు, కార్యదర్శి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి సుబ్రమణ్యం, కోశాధికారి మిట్టాశంకర్‌బాబు, రాజబాబు పాల్గొన్నారు.


ఉత్సవాల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సభ ప్రతినిధులు

వైకాపాతో అంటకాగిన అధికారులు బదిలీపై వెళ్లడానికి ఇష్టపడడం లేదు. తాము పనిచేస్తున్నచోటే తిష్ట వేసుకుని కూర్చోవాలని ముమ్మర ప్రయత్నాల్లో ఉన్నారు. కూటమి నేతలను మచ్చిక చేసుకుని తిరిగి కొనసాగేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. వీరి పనితీరుపై ఆగ్రహంతో ఉన్న కూటమి నేతలు రగిలిపోతున్నారు. ఎన్డీయే అధికారంలోకి వచ్చినా బదిలీల పరంగా ఆశించినంతగా మార్పు రాలేదని ప్రజల్లోనూ చర్చ సాగుతోంది. ప్రత్యేకించి పంచాయతీరాజ్‌శాఖలో బదిలీలకు పారదర్శకంగా చర్యలు చేపట్టినా అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల్లో అమలు కావడంలేదు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించినా ఇక్కడ ఇతర జిల్లాల కంటే భిన్నంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి.



నాడు వైకాపాతో అంటకాగి... నేడు బదిలీలపై నానా యాగి!

- ఈనాడు, కడప

ప్రజారోగ్య శాఖలో కీలక ఇంజినీర్ల వైఖరి

వివిధ ప్రభుత్వ శాఖల్లోనూ ఇదే పరిస్థితి

కడప ప్రజారోగ్యశాఖలో ఉమ్మడి కడప జిల్లా ఈఈగా గత ఎనిమిదేళ్లుగా ఒకే స్థానంలో పనిచేస్తున్న ఓ అధికారి తాజాగా ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో చేరేందుకు ఎటువంటి ఆసక్తి చూపని అధికారిని బదిలీ చేసి ఆయన రాకుండా ఉండేలా ఎత్తుగడ వేశారు. దీంతో కడపలోనూ సదరు ఈఈ డిప్యుటేషన్‌పై పనిచేసేవిధంగా ముందస్తు పన్నాగం పన్నారు. అవసరమైతే కడప నగరపాలక సంస్థ ఎస్ఈగానూ నియమితులయ్యేందుకు ఎత్తులు సైతం వేస్తున్నారు. వైకాపా కీలక నేతలతో బంధుత్వం, ఆపై సొంత జిల్లా కావడం, వైకాపా నేతలతో అంటకాగడం ద్వారా ఉమ్మడి కడప జిల్లాలో చక్రం తిప్పుతున్నారు. ఇదే విభాగంలో ఏఈగా కొలువులో చేరిన ఓ ఇంజినీరింగ్ అధికారిణి దీర్ఘకాలికంగా కడపలోనే విధులు నిర్వహిస్తూ ఇటీవల డీఈఈగానూ ఉద్యోగోన్నతి పొందారు. తాజా బదిలీల్లో సదరు అధికారిణి ప్రొద్దుటూరుకు బదిలీపై వెళ్లారు. ఈమె సైతం కడపలో డీఈఈ పోస్టు ఖాళీగా ఉంచి డిప్యుటేషన్‌పై రావడానికి అన్నిరకాలుగా ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నారు.

- జిల్లాపరిషత్తు కార్యాలయంలో ఇటీవల పలువురు అధికారులు బదిలీ అయ్యారు. వీరిలోనూ దాదాపు అందరూ అక్కడ నుంచి రిలీవ్ కావడానికి ఇష్టపడడంలేదు. బదిలీ ఆపుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అనంతపురం నుంచి రావాల్సిన అధికారిణి ఇక్కడకు రాకుండా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అర్హత లేకున్నా గత వైకాపా ప్రభుత్వ హయాంలో పలువురు కీలక పోస్టుల్లో అందలమెక్కారు. పంచాయతీరాజ్‌శాఖకు చెందిన ఓ అధికారి దీర్ఘకాలంగా పనిచేస్తున్నా జిల్లా దాటి వెళ్లడానికి సుముఖంగా లేరు. జిల్లా ఉన్నతాధికారి చెప్పారంటూ రిలీవ్ కాకుండా ఇక్కడే తిష్ఠ వేసుకున్నారు. ఇదే శాఖలో అన్నమయ్య జిల్లాలో ఓ కీలక అధికారిణికి ఓ మాజీ మంత్రికి కీలక అనుచరురాలిగా ముద్ర ఉంది. కుటుంబసభ్యులు సైతం వైకాపాలో కీలకంగా ఉన్నారు. ఈమె బదిలీ నుంచి తప్పించుకున్నారు.

- రాష్ట్రంలో ఎక్కడా జరగనంతగా బద్వేలు నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు జరిగాయి. ఇక్కడ మండల స్థాయి రెవెన్యూ అధికారుల హస్తంతోనే భూదందాలు సాగాయి. చాలా మంది సిబ్బంది నియోజకవర్గ స్థాయిలోనే పైరవీలతో బదిలీ చేయించుకున్నారు. అక్రమాల్లో ఆరితేరిన సిబ్బంది పక్క మండలాల్లోకి ప్రవేశించారు. అభియోగాలున్న సిబ్బందిని నియోజకవర్గాన్ని దాటించే ప్రయత్నం చేయలేదు. వీఆర్వోలైతే చాలామంది అక్కడే తిష్ఠ వేసుకున్నారు. ఇదే పరిస్థితి తంబళ్లపల్లె నియోజకవర్గంలోనూ నెలకొంది. పులివెందుల పురపాలక సంఘంలో చక్రం తిప్పిన ఓ కీలక అధికారి బద్వేలుకు బదిలీపై రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. పులివెందుల జగనన్న కాలనీల్లో అక్రమాలకు ఆద్యుడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు అధికారికి బద్వేలులో కీలక పోస్టు లభించింది. రహదారులు, భవనాల శాఖలో జరిగిన బదిలీలపైనా అంతా విస్తుపోతున్నారు. కూటమి ప్రభుత్వం వస్తే వైకాపాతో అంటకాగిన, అక్రమాలకు పాల్పడిన అధికారుల భరతం పడతారనే అభిప్రాయం ఉండగా, చాలా మంది వివిధ మార్గాల్లో తప్పించుకుని జిల్లాలోనే తిష్ఠ వేయడంపై సర్వత్రా విస్తృత చర్చ సాగుతోంది.

రేపటి నుంచి దసరా సెలవులు

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లాలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు అక్టోబరు 3 నుంచి 13వ తేదీ వరకూ దసరా సెలవులు ప్రకటించినట్లు డీఈవో అనురాధ, ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్ఐవో) వెంకటసుబ్బయ్య మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ అన్ని యాజమాన్యాల విద్యార్థులకు సెలవులు తప్పని సరిగా ఇవ్వాలని, నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

జిల్లాలో 98 శాతం పింఛన్ల పంపిణీ

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ తొలిరోజు మంగళవారం దాదాపు 98 శాతం మందికి అందజేశారు. మొత్తం పింఛన్లు 2,61,663 ఉండగా, సాయంత్రానికి 2,55,626 మందికి పంపిణీ చేశారు. మిగిలిన వాటిని బుధవారం అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు.

వైవీయూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా తప్పెట



వైవీయూ (కడప), న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా వైవీయూ తెలుగు విభాగం ఆచార్యులు తప్పెట రామప్రసాద్‌రెడ్డి నియమితులయ్యారు. వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి మంగళవారం ఆయనకు నియామకం పత్రం అందజేశారు. ఇప్పటివరకు ఆ బాధ్యతలు నిర్వర్తించిన ఎస్.రఘునాథరెడ్డి రిలీవ్ అయి ప్రధానాచార్యులుగా కొనసాగనున్నారు. తప్పెట రామప్రసాద్‌రెడ్డికి 30 ఏళ్ల సుదీర్ఘమైన బోధనానుభవం ఉంది.

డీఎఫ్‌వోల బాధ్యతల స్వీకరణ

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా రాజశేఖర్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఆయన నెల్లూరు జిల్లా కావలి సబ్‌డీఎఫ్‌వోగా పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. కడప సోషల్ ఫారెస్టు డీఎఫ్‌వోగా శివకుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయన తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్‌లో పనిచేస్తూ బదిలీపై వచ్చారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కడప విద్య, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్త కార్యాచరణకు సంబంధించిన నోటీసును డీఈవో అనురాధకి అందజేశారు. ఈ సందర్భంగా పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూల్స్‌లో తగినంత మంది సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించేందుకు వీలుగా ఎస్జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. నవంబరులోగా ఉద్యోగోన్నతులు ఇవ్వాలని, బదిలీలు వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నరసింహారావు, ఏజాస్‌అహ్మద్, బత్తుల చంద్రశేఖర్, గాజులపల్లి గోపీనాథ్, రామకేశవ, మధుసూధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డీఈవో అనురాధకు నోటీసు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

విభజన హామీలు అమలు చేయాల్సిందే

ప్రజా సంఘాల నేతల డిమాండు

అరవిందనగర్, న్యూస్‌టుడే: విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ కడప కలెక్టరేట్ ఎదుట మంగళవారం రాజకీయ పార్టీలతోపాటు ప్రజా, యువజన, విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. కడప నగరంలోని అంబేడ్కర్ కూడలి నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఐకాస కన్వీనర్ నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు సత్తార్, బీఎస్పీ నేత గుర్రప్ప, ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ శంకర్, ఆర్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు తదితరులు మాట్లాడుతూ కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, కడప-బెంగళూరు రైల్వేలైను పనులను పూర్తి చేయాలని డిమాండు చేశారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఆర్పీ ప్రసాద్, కృష్ణ, దస్తగిరి, మైనుద్దీన్, రాజేంద్ర, నాగేంద్ర, గోపి, నరసింహ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కొత్త మద్యం విధానానికి శ్రీకారం : కలెక్టర్

ఈనాడు, కడప: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం విధానానికి శ్రీకారం చుట్టినట్లు కలెక్టర్ శివశంకర్ వెల్లడించారు. మద్యం దుకాణాల కేటాయింపునకు దరఖాస్తుల స్వీకరణ మంగళవారం నుంచి ప్రారంభిస్తూ నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఆబ్కారీశాఖ అధికారులతో కలిసి మంగళవారం ఆయన మాట్లాడారు. ఈ నెల 9 వరకు దరఖాస్తులు స్వీకరణ జరుగుతుందని, జిల్లాలో 139 దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈనెల 11న జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో లాటరీ ద్వారా దుకాణాల నిర్వహణకు దరఖాస్తుదారులను ఎంపిక చేస్తామని, ప్రతి దరఖాస్తుకు రూ.2 లక్షల నగదు చెల్లించాల్సి ఉంటుందని, దరఖాస్తు సొమ్ము తిరిగి ఇవ్వబడదన్నారు. ఈ నెల 12 నుంచి కొత్త మద్యం విధానం అమల్లోకి వస్తుందని వివరించారు. దుకాణాలు లాటరీలో పొందిన వ్యక్తులు లైసెన్స్ ఫీజు ఏడాదికి పది వేల జనాభాలోపు ప్రాంతానికి రూ.50 లక్షలు, 10 వేల నుంచి 50 వేల వరకు జనాభా ఉంటే రూ.55 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభా ప్రాంతానికి రూ.65 లక్షలు వంతున చెల్లించాల్సి ఉంటుందని, పలు దఫాలుగా చెల్లింపులకు వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఏటా 10 శాతం హెచ్చింపు సొమ్ముతో లైసెన్స్ ఫీజు చెల్లించాలని, రూ.5 లక్షలు అదనంగా చెల్లించే పక్షంలో మోడల్ షాపు ఏర్పాటుకు అవకాశం కల్పిస్తామని వివరించారు. మద్యం గోదాము నుంచి దుకాణానికి మద్యం తరలించే వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం అమర్చుకోవాలని, దరఖాస్తు రాని ప్రాంతాల్లో ప్రభుత్వమే దుకాణం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. అవగాహన, ఫిర్యాదుల కొరకు కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తున్నామని, 08562-246344కు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో ఆబ్కారీశాఖ ఉప కమిషనరు జయరాజ్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీపీఈవోలు వినోద్‌కుమార్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, పక్కన ఆబ్కారీశాఖ అధికారులు

బాలబడులకు మహర్దశ!

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు


ఒంటిమిట్ట మండలం కొండమాచుపల్లె అంగన్‌వాడీ కేంద్రం

- న్యూస్‌టుడే, కడప

గత అయిదేళ్ల వైకాపా పాలనలో బాలబడుల నిర్వహణను గాలికొదిలేశారు. మాతాశిశు సంరక్షణలో కీలకమైన అంగన్‌వాడీ కేంద్రాల బాగోగులను అప్పటి సీఎం జగన్ విస్మరించారు. తమ హక్కుల సాధనకు కార్యకర్తలు, సహాయకులు సంయుక్తంగా సమ్మెబాట పట్టారు. ఉక్కు పిడికిలి బిగించి ఉద్యమించినా జగన్ ఏలుబడిలో న్యాయం జరగలేదు. తాగేందుకు గుక్కెడు నీరు కల్పించలేదు. మరుగు వసతి మాటను మరిచారు. సౌకర్యాల కల్పనపై అంతులేని నిర్లక్ష్యం చేశారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మంచి రోజులొచ్చాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చేపట్టాల్సిన పనులకు అనుమతిచ్చారు.

- జిల్లాలో మహిళా, శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో 13 ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు 2,212, చిన్నవి (మినీ) 177 చోట్ల సేవలందిస్తున్నాయి. సొంత భవనాలున్నవి 1,031, అద్దె గదుల్లో ఉన్నవి 957, బాడుగ మినహాయింపులున్నవి 401 ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిధులతో సొంత గూడు ఉన్న చోట రక్షిత జలాలు అందుబాటులోకి తీసుకురావాలని ఇటీవల ఎన్డీయే ప్రభుత్వ పాలకులు నిర్ణయించారు. ఈ మేరకు అవసరమైన పనులు చేయించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. తాగునీటి పనులు చేయడానికి ఒక్కొక్క కేంద్రానికి రూ.17 వేలు వంతున కేటాయించారు. జిల్లాలోని పల్లెల్లో 508 పనులు చేయాలని గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ కడప, పులివెందుల డివిజన్ సాంకేతిక నిపుణులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. పురపాలకల్లో ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో 40 చోట్ల చేయాలని అనుమతి ఇచ్చారు. ఇందుకోసం రూ.93.16 లక్షలకు పరిపాలనమోదం ఇచ్చారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు ఖర్చవుతుందని అంచనా వేసి ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు 344 కేంద్రాలు, ప్రజారోగ్యశాఖకు 34 పనులు అప్పగించారు. ఇందుకోసం 136.08 లక్షలు ఇవ్వడానికి జిల్లా అధికారులు ఆమోదం తెలిపారు.

శరవేగంగా పూర్తి చేయిస్తాం : జిల్లాలో సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతిచ్చాం. క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేసి, పనులు చేస్తున్న అధికారులతో సమన్వయం చేసుకుని శరవేగంగా చేయించడానికి చర్యలు తీసుకుంటాం. **- శ్రీలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్, కడప**

ఇసుక బస్తాలే జలాశయానికి రక్ష



పెంచికల బసిరెడ్డి జలాశయం (పీబీఆర్) రాతికట్టడం మరమ్మతులకు అనుమతులు రాకపోవడంతో ఇసుక బస్తాలు రక్షణగా మారాయి. 2021లో ఆయకట్టుకు నీటి విడుదలతో జలాశయం రాతి కట్టడం 300 మీటర్ల మేర కుంగిపోయింది. 2021, 2022లో భారీగా నీటి నిల్వ ఉండటంతో మరమ్మతులు చేపట్టలేకపోయారు. రూ.14.38 కోట్లు నిధులు అవసరమని గతేడాది ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. టెండర్ల ప్రక్రియ చేపట్టినా బిల్లులు సకాలంలో రావని గుత్తేదారులు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. దీనిపై పీబీసీ ఈఈ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే రాతికట్టడం మరమ్మతులు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, లింగాల**

శనగ విత్తనాల ధర ఖరారు

న్యూస్‌టుడే, ఒంటిమిట్ట, ప్రొద్దుటూరు

భూమి ఆధారంగా విత్తన పంపిణీ ఇలా

విస్తీర్ణం (ఎకరాల్లో)	బస్తాల సంఖ్య
0.50	1
0.51 - 1	2
1.01 - 1.50	3
1.51 - 2	4
2.01 - 2.50	5
2.51 -3	6
3.01- 3.50	7
3.51- 4	8
4.10 - 4.50	9
4. 51 -5	10

ఈ రబీలో నల్లరేగడి భూముల్లో వర్షాధారంగా శనగ పంటను రైతులు సాగు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. వ్యవసాయశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఈ మేరకు విత్తనాల ధరలను ఖరారు చేశారు. సేకరణ, సరఫరా బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థకు అప్పగించారు. క్షేత్రస్థాయిలో పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 31 మండలాల్లో శనగ పంట సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. సాధారణ విస్తీర్ణం 82,261 హెక్టార్లు. ఈ సారి రైతులకు జె.జి-11 రకం విత్తనాలు ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లాకు 72,386 క్వింటాళ్లు కేటాయించారు. అందులో తొలివిడతలో 26 మండలాలకు కావాల్సిన 62,386 క్వింటాళ్లను ఏపీ సీడ్స్ సంస్థ ద్వారా పంపిణీ చేయాలని అనుమతిచ్చారు.

కిలోకు రైతు చెల్లించాల్సింది రూ.70.50

ఈ సారి కిలో పూర్తి ధర రూ.94గా ఖరారు చేశారు. ప్రభుత్వం రూ.23.50 (25 శాతం) రాయితీ ఇస్తోంది. రైతులు తమ వాటా కింద రూ.70.50 (75 శాతం) చెల్లించాలి. అవసరమైన వారు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలి. అయిదు ఎకరాలు భూమి ఉంటే గరిష్ఠంగా 10 బస్తాలు (మూట 20 కిలోలు) ఇస్తారు.

ఈసారి 25 శాతం రాయితీ



నాణ్యతపై రాజీపడం

ఈ రబీ సీజన్‌లో రైతులకు కావాల్సిన శనగ విత్తనాలను రాయితీపై పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. క్షేత్రస్థాయి నుంచి ఈసారి ఎన్ని హెక్టార్లలో సాగు చేస్తారు, ఎన్ని క్వింటాళ్లు కావాలని సమాచారాన్ని సేకరించాం. మండలాల వారీగా విత్తన కేటాయింపులు చేశాం. నాణ్యతలో రాజీపడం. నాసిగా ఉంటే వెనక్కి పంపిస్తాం.

- ఎ.నాగేశ్వరరావు, డీఏవో

రబీపై కోటి ఆశలు

ఖరీఫ్‌లో కర్షకులకు కాలం కలిసిరాలేదు. సాగు ఆశాజనకంగా లేదు. దీంతో రబీపై రైతులు కోటి ఆశలు పెట్టుకున్నారు. సకాలంలో విత్తనం పంపిణీ చేస్తే అదునులో ముందసుగా పంట సాగు చేసుకుంటామని వారు చెబుతున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో 40 శాతం రాయితీపై విత్తనాలు ఇచ్చారు. ఈసారి 25 శాతానికే పరిమితం చేశారు. దీంతో గతేడాదితో పోలిస్తే భారం పడనుంది. నిరుడు కొన్ని మండలాలకు నాసిరకం, పుచ్చులు పంపించారు. రైతులు కొనుగోలు చేయడానికి విముఖత చూపారు. ఈసారి ఇలాంటి పరిస్థితి రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

తెదేపాలోకి వైకాపా కౌన్సిలర్లు


పార్టీలో చేరిన కౌన్సిలర్లతో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, నాయకులు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులో ఇద్దరు వైకాపా కౌన్సిలర్లు తెదేపాలో చేరారు. పురపాలక కౌన్సిలర్లు పల్లా రమాదేవి (38వ వార్డు), జిలాన్‌బాషా (14వ వార్డు) ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో తెదేపాలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంకా కొంత మంది కౌన్సిలర్లు తెదేపాలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. త్వరలో కౌన్సిల్‌లో తమకు పూర్తి స్థాయి ఆధిక్యత రాబోతోందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రంతో పాటు తమ వార్డుల్లో అభివృద్ధి జరుగుతుందని నమ్మి కౌన్సిలర్లు తెదేపాలోకి వస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి నిరంతరం కొనసాగుతుందన్నారు. అనంతరం సురేష్‌నాయుడు మాట్లాడుతూ... వైకాపా ప్రభుత్వంలో కౌన్సిలర్లు అవమానాలకు గురయ్యారని, ప్రస్తుతం వారికి స్వేచ్ఛ లభించిందన్నారు. పార్టీలో చేరిన వారికి తామంతా అండగా ఉంటామని, పట్టణాభివృద్ధిలో వారంతా పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, నాయకులు ఈవీ.సుధాకర్‌రెడ్డి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అగ్నిమాపక ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన సంఘ ప్రతినిధులు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా అగ్నిమాపక శాఖ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారంలో కడపలో నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీంద్రరెడ్డి, శివరాం రాష్ట్ర క్రీడల-సాంస్కృతిక కార్యదర్శి నూర్‌బాషా పర్యవేక్షించారు. జిల్లా అధ్యక్షుడిగా పి.సుదర్శన్‌రెడ్డి(పులివెందుల), ఉపాధ్యక్షులుగా ఎం.రాజశేఖర్(రాయచోటి), కార్యదర్శిగా ఎం.గురుశంకర్(ప్రొద్దుటూరు), సంయుక్త కార్యదర్శిగా పి.సిద్దేశ్వర(బద్వేలు), కోశాధికారిగా ఎస్.వీరారెడ్డి(కడప), సలహాదారుడిగా కె.మురళీకృష్ణ(ప్రొద్దుటూరు)లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక అధికారి ధర్మారావు మాట్లాడుతూ సంఘం ప్రతినిధులు జిల్లాలోని సిబ్బంది సమస్యలు పరిష్కరించాలన్నారు.

4న కడప, చక్రాయపేటల్లో ఉద్యోగ మేళా

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 4న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చక్రాయపేట ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో, కడప ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో నిర్వహించే మేళాకు పదోతరగతి, ఆపై విద్యార్హత కలిగి, 32 ఏళ్ల లోపున్న యువత హాజరుకావాలని సూచించారు.

పది రోజుల్లో దోచేయాలని...

అధిక ధరలకు మద్యం విక్రయాలు



కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఈ నెల 12 నుంచి నూతన మద్యం పాలసీ అమలు చేయనున్న నేపథ్యంలో ప్రస్తుత దుకాణాలకు ఇంకా పది రోజుల గడువు మాత్రమే ఉంది. ఇదే అదనుగా అక్కడి సిబ్బంది తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ఒక్కో మద్యం సీసాపై రూ.10 నుంచి 20 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. యథేచ్ఛగా దుకాణాల్లోనే ఈ దందా సాగిస్తున్నారు. ఇలా నగరంలో ఒక్కో దుకాణంలో రోజుకు రూ.20 వేల వరకు దోపిడీ చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే కావాలంటే తీసుకో... లేదంటే వెళ్లిపో అంటూ దురుసుగా మాట్లాడుతున్నారు. ఎక్సైజ్ అధికారులు టెండర్ల హడావుడిలో ఉండగా ఇటువైపు ఎవరూ దృష్టిపెట్టడం లేదు. జిల్లా కేంద్రంలో డిప్యూటీ కమిషనర్, ఎన్‌ఫోర్సుమెంటు కమిషనర్, డిప్యూటీ సూపరిండెంటు, సీఐలు, ఎస్సైలు సిబ్బంది ఇంత మంది అధికారులు ఉన్నప్పటికీ ఇలా యథేచ్ఛగా దోపిడీ సాగించడంపై పలు విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ మాట్లాడుతూ అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మంత్రిని కలిసిన డీటీసీ

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఇటీవల కడప డీటీసీగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం రాయచోటిలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాను రవాణాపరంగా ముందుకు తీసుకెళ్లాలని డీటీసీకి మంత్రి సూచించారు. బ్రేక్ ఇన్‌స్పెక్టరు విజయభాస్కర్ ఉన్నారు.

బస్టాండులో ప్రయాణికుడి మృతి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. నగరానికి చెందిన షేక్ వలీసాహెబ్(53) కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మంగళవారం ఊరికెళ్లేందుకు బస్టాండుకు వచ్చారు. కుర్చీలో కూర్చుని కొద్దిసేపటికి అలానే పడిపోయారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ కానిస్టేబుల్ రవికుమార్ పరిశీలించగా అప్పటికే చనిపోయారు. వెంటనే ఆర్టీసీ అధికారులు... మృతుడి వద్ద ఉన్న లభించిన చరవాణి నంబరుతో బంధువులకు సమాచారం అందించగా, వారు వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లారు. గుండెపోటుతోనే మృతిచెందినట్లు భావిస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య...

కడప శివారులోని కనుమలోపల్లె వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వయసు 45 నుంచి 50 సంవత్సరాలుంటాయి. అతని కుడిచేతిపై త్రిశూలం ఆకుపచ్చ బొట్టు ఉందని, ఇతర ఆధారాలేవీ లభ్యం కాలేదని రైల్వేపోలీసులు తెలిపారు.

141 కేసుల్లో 581 మంది బైండోవర్

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా సెప్టెంబరులో అసాంఘిక కార్యకలాపాలపై ముమ్మరంగా దాడులు చేశామని జిల్లా పోలీసు అధికారి హర్షవర్ధన్‌రాజు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 141 కేసుల్లో 581 మందిని బైండోవర్ చేశామన్నారు. మద్యం అక్రమ విక్రయాలపై దాడులు చేసి 204 లీటర్ల మద్యాన్ని స్వాధీనపరచుకుని, 37 మందిని అరెస్టు చేశామన్నారు. 67 మంది మట్కా నిర్వాహకులను అరెస్టు చేసి, రూ.5.96 లక్షలు, 382 మంది జూదరులను అరెస్టు చేసి, రూ.11,41,920 జప్తు చేశామని చెప్పారు. 28కిలోల గంజాయిని జప్తు చేసి, 41 మందిని అరెస్టు చేశామని ఎస్పీ తెలిపారు. శిరస్త్రాణం ధరించకుండా తిరుగుతున్న వారిపై 4188 కేసులు నమోదు చేసి రూ.5,65,380 జరిమానా విధించామన్నారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల నిలిపివేత!

● గతంలో ఉమ్మడి కడప జిల్లాలో 175 చోట్ల అనుమతి
● గత ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు

-న్యూస్‌టుడే, కడప


రిజిస్ట్రేషన్లు చేయడానికి గతంలో ఎంపికైన పెన్నపేరూరు గ్రామ సచివాలయం

ఆస్తుల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వికేంద్రీకరణను సులభతరం చేస్తామని గత వైకాపా ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు శ్రీకారం చుట్టింది. ఆచరణలో మాత్రం చతికిలపడింది. దీనిని ఎన్డీయే ప్రభుత్వం రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

★ గత వైకాపా ప్రభుత్వం భూములకు రీ సర్వే చేయాలని నిర్ణయం తీసుకుంది. అధునాతన డ్రోన్లు, ఇతర పరికరాల ద్వారా భూముల కొలతలు తీయాలని ఆదేశాలిచ్చింది. రీ సర్వే పూర్తయిన గ్రామాల పరిధిలోని సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు చేయించాలని ఉన్నత స్థాయి నుంచి ఆదేశాలందాయి. సర్వే తర్వాత భూముల విస్తీర్ణంలో తేడాలొచ్చాయి. ఇది మరింత భూ వివాదాలకు కారణమవుతుందని కాకుండా కొత్త చిక్కులు తీసుకొచ్చింది.

★ క్షేత్రస్థాయిలో 2022, జనవరి 18 నుంచి రిజిస్ట్రేషన్లు చేయించాలని ప్రణాళికను రూపొందించారు. ఉమ్మడి కడప జిల్లాలో 175 సచివాలయాలను ఎంపిక చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ కూడా ఇచ్చారు. రీ సర్వే పూర్తయినా ప్రాంతాల్లోని సచివాలయాల్లో భూముల లావాదేవీలపై పెద్దగా రిజిస్ట్రేషన్లు జరగలేదు. కనీసం పదో వంతు కూడా ముందుకు సాగలేదు. మరోవైపు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకంలో ఏక కాలంలో చెల్లింపు (ఓటీఎస్) ద్వారా నిర్దేశించిన డబ్బులు చెల్లించిన లబ్ధిదారులకు హక్కు పత్రాలు ఇచ్చారు. వీటిని ధనాగారాల్లో కూడా తనఖా పెట్టుకొని లబ్ధిదారులు రుణం పొందవచ్చునని అప్పటి సీఎం జగన్ నమ్మించారు. బ్యాంకులకు పత్రాలు తీసుకెళ్లిన పేద, బడుగు జీవులకు నిరాశే మిగిలింది. గతంలో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులు నమ్మి మోసపోయారు. ఇప్పటికీ కొంతమందికి ఓటీఎస్ నగదు చెల్లించాలని హక్కు పత్రాలు కూడా ఇవ్వలేదు. తొలుత 72 గ్రామ సచివాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్ చేయించాలని ఏర్పాట్లు సిద్ధం చేశారు. కాకపోతే కొన్నిచోట్ల మాత్రమే ఈ విధానం అమలులోకి వచ్చింది. వైకాపా ప్రభుత్వానికి ప్రచారంపై చూపిన శ్రద్ధ అమలుపై చూపకపోవడంతో వ్యవస్థలో పెద్దగా పురోగతి లేదు. ప్రజలకు ఆశించిన స్థాయిలో ఉపయోగపడలేదు. మునుపటి విధానాన్ని అమలు చేయాలని ఎన్డీయే కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సచివాలయాల్లో ఆస్తుల అమ్మకాలు, కొనుగోళ్లపై ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయరాదని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తమపై పని ఒత్తిడి తగ్గిందని సిబ్బంది ఊరట చెందుతున్నారు.

భూదందాలో మదనపల్లెను మించింది బద్వేలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, పక్కన నాయకులు ఓబులేసు, ఈశ్వరయ్య, తదితరులు

బద్వేలు, గోపవరం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో మదనపల్లెను మించి బద్వేలులో భూదందా సాగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజమెత్తారు. మంగళవారం బద్వేలులో సీపీఐ ఆధ్వర్యంలో భూ సమస్యలపై జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో భూకబ్జాలు ఆ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున చేశారని విమర్శించారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని చివరకు సమాధులు ఉన్న స్థలాలను కూడా వదలకుండా రాయించుకుని, ఆ దస్త్రాల వివరాలున్న మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో దస్త్రాలను కాల్చేశారంటే ఇక ఆయన అరాచకాలు చెప్పకనే తెలుస్తాయన్నారు. వైకాపా ప్రభుత్వం హయాంలో రెవెన్యూ కార్యాలయాల్లో లంచాలివ్వడం భూములు ప్రభుత్వ స్థలాలను రాయించుకున్నారని ఆరోపించారు. ఓ వీఆర్వోకు పోరుమామిళ్లలో రూ.కోటి ఇల్లు, రూ.20 లక్షల విలువచేసే కారు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. బద్వేలు నియోజకవర్గంలో అక్కిందండ్ల నుంచి అట్లూరు వరకు 30 వేల ఎకరాలు వైకాపా పెద్దల చేతుల్లోకి వెళ్లాయన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబులేసు, ఈశ్వరయ్య, వీరశేఖర్, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, బాలు, ఇమ్మానియేలు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

వీరపునాయునిపల్లె: అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని యు.రాజుపాలెంలో అమరవీరుల స్తూపాల వద్ద నివాళులర్పించారు. కమలాపురం ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబులేసు, ఈశ్వరయ్య, గాలిచంద్ర పాల్గొన్నారు.

కారును వెంబడించి ఎర్రచందనం స్వాధీనం

సిద్దవటం, న్యూస్‌టుడే : ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న కారును అటవీ అధికారులు వెంటాడి స్వాధీనం చేసుకున్నారు. అట్లూరు వైపు నుంచి మంగళవారం ఉదయం ఎర్రచందనం దుంగల లోడుతో కారు సిద్దవటం వైపు వెళ్లింది. చెక్‌పోస్టు సిబ్బంది అనుమానంతో సమాచారాన్ని సిద్దవటం అటవీశాఖ అధికారులకు తెలపగా వారు వెంటనే స్పందించి కారును వెంబడించారు. దీనిని గుర్తించిన స్మగ్లర్లు అడ్డదారిలో మూలపల్లె గ్రామం మీదుగా కడప వైపు వెళ్లారు. సంటిగారిపల్లె శివారులో కొండ ప్రాంతం సమీపంలో కారు వదిలేసి స్మగ్లర్లు పరారయ్యారు. అక్కడకు చేరుకున్న అటవీ అధికారులు, పోలీసులు కారును, ఎనిమిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, నిందితుల కోసం గాలిస్తున్నారు.

పరారైన స్మగ్లర్లు


అధికారులు స్వాధీనం చేసుకున్న కారు

నగలు, నగదుతో పరారీ

చెన్నూరు, న్యూస్‌టుడే : చెన్నూరులో పెడబల్లె రాజేశ్వరమ్మ ఇంట్లో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. కొన్ని రోజులుగా రాజేశ్వరమ్మ ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని కుమారుడి వద్ద ఉంటున్నారు. దీన్నే అదునుగా భావించిన దుండగులు కిటికీలు తొలగించి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని రూ.80 వేల నగదు, 50 గ్రాముల బంగారం, కేజిన్నర వెండి ఆభరణాలతో పరారయ్యారు. సోమవారం బాధితురాలు హైదరాబాద్ నుంచి సొంతింటికి తిరిగి రాగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

కొండపేట కాలువలో ఇద్దరు చిన్నారుల గల్లంతు

ఒకరి మృతదేహం వెలికితీత మరొకరి కోసం గాలింపు


షేక్ యాసిన్ (పాత చిత్రం) .. షేక్ రఫీ

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు పట్టణం మీదుగా ప్రవహించే కేసీ కాలువలో భాగమైన కొండపేట కాలువలో మంగళవారం తొమ్మిదేళ్ల ఇద్దరు చిన్నారులు గల్లంతుకాగా షేక్ యాసిన్ మృతదేహం బయటపడింది. షేక్ రఫీ కోసం గాలిస్తున్నారు. శాంతినగర్ సమీపంలో నివాసం ఉంటున్న చిన్నారులు మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు రాగా సాయంత్రమైనా ఇంటికి చేరక పోవడంతో బంధువులు వెతికే క్రమంలో కాలువ గట్టు వద్ద దుస్తులు లభ్యం కావడంతో గల్లంతైనట్లు అనుమానిం వెతుకుతుండగా ఈ సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కూడా కాలువ వెంట గాలించారు. నీటి ప్రవాహాన్ని తగ్గించి వెతుకుతుండగా బద్వేలురోడ్డు అరుంధతీనగర్ వద్ద కాలువ మోరీ కింద షేక్ యాసిన్ (9) మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. యాసిన్ తల్లిదండ్రులు మత్తున్, కోపిమాకు అయిదుగురు సంతానం కాగా యాసిన్‌ను కోల్పోవడంతో విషాదం అలముకుంది. షేక్ రఫీ తల్లిదండ్రులు వ్యాపారం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిపోగా వారికి సమాచారం ఇచ్చినట్లు బంధువులు తెలిపారు.

పెళ్లయిన ఏడు నెలలకే నవ వధువు ఆత్మహత్య



ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: భర్త వేధింపులు తాళలేక పెళ్లైన ఏడు నెలలకే ఓ నవ వధువు బలవన్మరణం చెందారు. హృదయ విదారకరమైన ఈ ఘటన మంగళవారం ప్రొద్దుటూరు పట్టణంలో చోటుచేసుకుంది. మూడో పట్టణ రాణా పోలీసుల వివరాల మేరకు.. కడపలోని ఎర్రముక్కపల్లెకు చెందిన విజయకుమార్‌కు ప్రొద్దుటూరు సూపర్‌బజార్‌రోడ్డుకు చెందిన **పల్లా కీర్తి** (27)కి ఏడు నెలల కిందట వివాహమైంది. విజయకుమార్ హైదరాబాద్‌లో ఓ గుత్తేదారు వద్ద గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో కొత్త దంపతులు హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. భర్త మరో మహిళతో ఫోన్‌లో మాట్లాడుతుండటంతో భార్య అనుమానం పెంచుకున్నారు. ఈ విషయంపై భర్తను నిలదీయడంతో అప్పటి నుంచి వేధింపులకు గురిచేయడం ప్రారంభించాడు. దీంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. నాలుగు రోజుల కిందట ప్రొద్దుటూరులోని పుట్టింటికి వచ్చిన కీర్తి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పి బాధపడ్డారు. ఈ నేపథ్యంలో ఇంట్లోని ఇనుప పైపునకు తాడుతో ఉరి వేసుకుని కీర్తి మృతిచెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

చెట్టును ఢీకొన్న కళాశాల వ్యాను ● ఐదుగురికి గాయాలు


ఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన వాహనం... డ్రైవర్‌ను బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కమలాపురం, న్యూస్‌టుడే: మండలంలోని జంగంపల్లె గ్రామ సమీపాన ప్రధాన రోడ్డుపై మంగళవారం కళాశాల వ్యాను అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. పెనుప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఎస్సై ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.... పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాలకు చెందిన వ్యానులో వివిధ గ్రామాల నుంచి సుమారు 30 మంది విద్యార్థులను ఎక్కించుకుని వస్తుండగా, జంగంపల్లె సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొని ఆగిపోయింది. విద్యార్థులు వెంటనే బయటకు వచ్చేయగా, వ్యాన్ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో రాలేకపోయారు. పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీని తీసుకొచ్చి వ్యానును లాగారు. తర్వాత డోర్ పగలగొట్టి డ్రైవర్‌ను బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ బాలరాజుతో పాటు చైత్యశ్రీ, వెంకట హరీష, మరో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. వారిని 108లో కమలాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్సై తెలిపారు. వ్యాను కండిషన్ సరిగా లేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఘటనా స్థలంలో లోతైన గుంతలు ఉన్నాయని, చెట్టును ఢీకొని ఆగిపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

చిన్నప్పటి నుంచి నైతిక విలువలు నేర్పాలి


జ్ఞాపికలు అందుకున్న వృద్ధులతో కలెక్టర్ శివశంకర్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: పిల్లలకు చిన్నప్పటి నుంచే నైతిక విలువలు నేర్పించాలని కలెక్టర్ శివశంకర్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులను మించిన దైవం లేరని, వృద్ధాప్యంలో వారిని చక్కగా చూసుకోవాలని సూచించారు. చిన్నారులకు నీతి శతకాలు, కథలు, పురాణాలు, ఇతిహాసాలను వివరించాలన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, వయోవృద్ధులను సత్కరించారు. అంతకుముందు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వికలాంగుల శాఖ ఏడీ కృష్ణకిషోర్, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్‌కుమార్ పాల్గొన్నారు..

● కలెక్టరేట్‌లో జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖాన్‌కారిస్టా, ప్రభుత్వ రక్తనిధి కేంద్రం సంయుక్తంగా తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఏర్పాటు చేసిన రక్తదానశిబిరాన్ని ఆయన కలెక్టర్ ప్రారంభించారు.

● ఫ్రీ హోల్డ్‌భూములను నిశితంగా పరిశీలించాలని రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. మంగళవారం మంత్రి జిల్లా అధికారులతో దృశ్యమాధ్యమంలో సమీక్షించారు.

● **ఓటర్ల జాబితా సవరణపై పక్కా సర్వే :** జిల్లాలో ఓటర్ల జాబితా సవరణకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నామని ఇందుకు సంబంధించి ఇప్పటికే 99 శాతం హౌస్‌టుహౌస్ సర్వే పూర్తి చేశామని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్‌యాదవ్ మంగళవారం ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితాపై దృశ్య మాధ్యమంలో సమీక్షించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో గంగాధర్ గౌడ్ హాజరయ్యారు.

డీసీఈబీ భవనాన్ని వెంటనే నిర్మించాలి

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లా ఉమ్మడి పరీక్షా కేంద్ర భవన (డీసీఈబీ) నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని తక్షణమే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా ఛైర్మన్ మాదన విజయకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీఎస్ఐ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఫ్యాప్టో జిల్లా శాఖ సమావేశం జరిగింది. విజయకుమార్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో కేటాయించిన పదిసెంట్ల స్థలంలో భవన నిర్మాణం చేపట్టాలని సూచించారు. వివిధ సంఘాల నాయకులు షేక్ మహమ్మద్ ఇర్షాద్, ఇలియాస్ బాషా, ఖాదర్‌బాషా, అబ్దుల్లా, నరసింహారావు, వెంకటసుబ్బారెడ్డి, డాక్టర్ హరికొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 75 మంది ఎక్సైజ్ కానిస్టేబుళ్ల బదిలీ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: సాధారణ బదిలీల్లో భాగంగా వైయస్ఆర్ జిల్లాలో పని చేస్తున్న 75 మంది ఎక్సైజ్ కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిని ఎన్‌ఫోర్సుమెంటు, విజిలెన్స్, స్క్వాడ్, మద్యం డిపో, ఈగల్ డిస్టలరీ తదితర విభాగాల్లో నియమించారు. కొంతమందిని అన్నమయ్య జిల్లాకు కూడా బదిలీ చేశారు.

ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : యోగివేమన విశ్వవిద్యాలయం సమీపంలోని రహదారి వద్ద సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో కానిస్టేబుల్ శ్రీనివాసులురెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ఎస్.ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన సమాచారం మేరకు.. వేంపల్లె పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులురెడ్డి వేంపల్లె నుంచి కారులో కడప బయలుదేరారు. యోగివేమన విశ్వవిద్యాలయం సమీపంలోని రహదారి వద్ద ఆయన తీవ్రంగా గాయపడి కిందపడి ఉండటాన్ని వాహనదారులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని బాధితుడిని వేలూరులోని ఆసుపత్రికి తరలించారు. ఆయనపై ఎవరైనా దాడి చేసి గాయపరిచారా లేక ప్రమాదం చోటు చేసుకుందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. గాయపడిన కానిస్టేబుల్ ప్రస్తుతానికి మాట్లాడలేకపోతున్నారని, ఆయన మాట్లాడితే అసలు విషయం తెలుస్తుందన్నారు.


జాబితా విడుదల చేస్తున్న వైవీయూ అధికారులు

వైవీయూ ఎన్ఎస్ఎస్ పురస్కారాల జాబితా వెల్లడి

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి వర్సిటీ స్థాయి ఎన్ఎస్ఎస్ పురస్కారాలకు ఎంపికైన వారి జాబితాను వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఎస్.రఘునాథరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకట్రామిరెడ్డి తదితరులు విడుదల చేశారు. జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా ఈ నెల 4న జిల్లా వ్యాప్తంగా 5 మంది పీవోలు, ముగ్గురు వాలంటీర్లు, ముగ్గురు ప్రిన్సిపాళ్లకు పురస్కారాలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఉత్తమ వాలంటీర్లు: డి.మానస (యూనిట్ 9, వైవీయూ), ఐ.మహబూబ్‌బాషా (ఎస్‌బీఎస్‌వీఎం డిగ్రీ కళాశాల, మైదుకూరు), మీనాక్షి (ప్రభుత్వ జూనియర్ కళాశాల, కడప) ఉత్తమ పీవోలు: కె.శ్రీనివాసరావు (వైవీయూ), ఎం.దొరస్వామినాయక్ (ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల, బద్వేలు), బి.రవికుమార్ (ఎస్‌బీఎస్‌వీఎం డిగ్రీ కళాశాల, మైదుకూరు), జి.రఘురామయ్య (ప్రభుత్వ జూనియర్ కళాశాల, వీరబల్లి), ఎల్. హేమలత కృష్ణవేణి (ఏపీ మోడల్ జూనియర్ కళాశాల, పెనగలూరు)

ఉత్తమ కళాశాలలు, ప్రిన్సిపాళ్లు: డాక్టర్ సి.యోగాంజనేయులు (ప్రభుత్వ జూనియర్ కళాశాల, వేంపల్లి), డాక్టర్ కె.వెంకటసుబ్బారెడ్డి (ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల, బద్వేలు), షేక్ నూర్జహాన్ (ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, కడప)

పుష్పగిరిలో సామూహిక పిండప్రదానం నేడు

వల్లూరు, న్యూస్‌టుడే : మహాలయ అమావాస్య సందర్భంగా బుధవారం పుష్పగిరి కొండపై రుద్రపాదం వద్ద సామూహిక పిండప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాసులు, ఛైర్మన్ వెంకటసుబ్బారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పిండ ప్రదానం కోసం వినియోగించే వస్తువులను కమిటీ నిర్వాహకులు ఉచితంగా అందిస్తారన్నారు. నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో భక్తులు చెన్నూరు మీదుగా ఆలయానికి చేరుకోవాల్సిందిగా సూచించారు.


ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల నాయకులు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

మారుతీనగర్, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ పరం చేయాలని కేంద్రం ఆలోచన చేయడం అత్యంత దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల నాయకులు మండిపడ్డారు. విభజన హామీల్లో ప్రధానమైన కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయకుంటే పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, రవి, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు నిర్మల్, నగర కన్వీనర్ విజయ్, అభినయ్ పాల్గొన్నారు.

ముగ్గురాయి గనులపై పోలీసుల దాడులు

వేముల, న్యూస్‌టుడే : మండలంలోని ముగ్గురాయి గనులపై పోలీసులు దాడులు ముమ్మరం చేశారు. ఆదివారం రాత్రి వి.కొత్తపల్లెకు చెందిన వీఆర్ఏ నరసింహులును ఇదే గ్రామానికి చెందిన బాబు అనే వ్యక్తి డిటోనేటర్లు, జిలిటిన్‌స్టిక్స్ ఉపయోగించి హత్య చేసిన విషయం విదితమే. నిందితుడిని పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. హత్యకు ఉపయోగించిన పేలుడు పదార్థాలు ఎక్కడి నుంచి వచ్చాయనే కోణంలో విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలో చేపడుతున్న గనులపై ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు చేశారు. గనుల వద్ద తనిఖీలు చేయగా వేముల సమీపంలోని ఓ గని వద్ద డిటోనేటర్లు, జిలిటిన్‌స్టిక్స్ ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తీసుకొచ్చారు. వీటితో సంబంధం ఉందన్న అనుమానంతో కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై సీఐ నాగరాజు, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను చరవాణి ద్వారా సంప్రదించేందుకు యత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

ప్రొద్దుటూరు

● ప్రొద్దుటూరు ● జమ్మలమడుగు ● బద్వేలు ● మైదుకూరు

ఘనంగా పెద్దనాగయ్యస్వామి ఆరాధన



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కలసపాడు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని సనీరెడ్డి ఒద్దున ఉన్న పెద్దనాగయ్యస్వామి ఆరాధన మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక మూడురోడ్ల కూడలి నుంచి గజమాలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పాఠశాలకు దేశ నాయకుల చిత్రపటాల వితరణ

మైదుకూరు, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా మండలంలోని సుంకులుగారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలకు మంగళవారం ఉప్పుగుంటపల్లెకు చెందిన దాతకుడు కృష్ణ కిశోర్ యాదవ్ రూ.10 వేల విలువైన దేశనాయకుల చిత్రపటాలు అందజేశారు. కృష్ణ కిశోర్ తరఫున ఆయన అనుచరులు చిత్రపటాలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మీదేవికి అందజేశారు. అనంతరం విద్యార్థులకు భోజనం అందించారు. ఉపాధ్యాయులు వరలక్ష్మి, వాహీదా పాల్గొన్నారు.



దేశనాయకుల చిత్రపటాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మేమున్నాం... మీకు తోడుగా... (10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9494294241
మైదుకూరు : 8008573447
బద్వేలు (గ్రామీణ) : 8008573493

? ఇందిరమ్మకాలనీకి వెళ్లే దారిలో బావి వద్ద చెత్తాచెదారం రోడ్డుపైకి చేరుతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. - మహబూబ్‌బాషా, ఇందిరమ్మకాలనీ

✓ : పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్తాచెదారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - పెంచలయ్య, పురపాలక అధికారి - న్యూస్‌టుడే, మైదుకూరు

కొండలు పిండి చేస్తున్నారు

❖ పట్టని అధికారులు

–న్యూస్‌టుడే, బి.కోడూరు

పచ్చని ప్రకృతిసిద్ధమైన కొండలు ప్రభుత్వ భూములు కావడంతో మట్టిని తవ్వి ఇష్టానుసారంగా ప్రకృతిని నాశనం చేస్తున్నారు. వాహనదారులకు బద్వేలు మొదలు పోరుమామిళ్లకు వెళ్లే వరకు అందమైన పచ్చని చెట్లు దారిపోడవునా కనిపిస్తాయి. గత వైకాపా ప్రభుత్వంలో ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములను నాయకులు దోచుకున్నారు. ఇప్పుడు బద్వేలు బైపాస్ రోడ్డుకు మట్టిని తరలిస్తున్నామని అనుమతి తీసుకున్నారు. అనుమతి ఒక చోట పనులు మరోచోటగా గుంతలుగా తవ్వి వదిలేస్తున్నారు. ఓ కంపెనీ వారు మండలంలోని కామకుంట సర్వే నంబరు 162/పి రెండు ఎకరాలకు అనుమతి తెచ్చుకొని ప్రస్తుతం పెద్దులపల్లె, కొండంపల్లె, నరసింహాపురం గ్రామ పొలాల సరిహద్దులకు మించి మట్టిని తవ్వుతున్నారు. కనీసం నిబంధనలు పాటించకుండా టిప్పర్లల్లో మట్టిని పంపుతున్నారు. ద్విచక్ర వాహనదారులు రహదారిపై వెళ్లే వారికి దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. టిప్పర్‌పైన పట్టలు వేసుకోకుండా ఆగమేఘాలపై పోవడం వలన లారీలో ఉన్న మట్టి ద్విచక్ర వాహనదారులకు పడుతుందని వాపోతున్నారు. ఈ విషయంపై బి.కోడూరు బాధ్య తహసీల్దారు మధునాయక్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఇష్టానుసారంగా మట్టిని తవ్వకుండా అనుమతి ఉన్న మేరకే తవ్వాలని చెప్పానన్నారు.



పెద్దులపల్లె గ్రామ సరిహద్దు కొండలో ఇష్టానుసారంగా తవ్విన మట్టి



పట్టలు కట్టుకోకుండా రహదారిపై మట్టి లోడుతో వెళుతున్న టిప్పర్

సమాజ సేవకుడికి సత్కారం

కలసపాడు, న్యూస్‌టుడే : మండలంలోని తెల్లపాడుకు చెందిన వివేకానంద సంస్థ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి మంగళవారం కలెక్టరు శివశంకర్ చేతుల మీదుగా ఉత్తమ సమాజసేవకుడి అవార్డు అందుకున్నారు. రామకృష్ణారెడ్డి సమాజంలో ఎంతో మంది అభాగ్యులు, అనాథలను ఆదరించి ఆశ్రయం కల్పించారు. అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడంతో పాటు పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన జిల్లా కలెక్టరేట్‌లో రామకృష్ణారెడ్డిని జిల్లా కలెక్టరు శివశంకర్ ఉత్తమ సేవకుడి అవార్డుతో సత్కరించారు.



రామకృష్ణారెడ్డికి అవార్డు అందజేస్తున్న కలెక్టరు శివశంకర్

ధ్యాన దసరా ఉత్సవాలకు రావాలని కలెక్టరుకు ఆహ్వానం

జిల్లా సచివాలయం: ఎర్రగుంట్ల పరిధిలోని పోట్లదుర్తి బిస్మిల్లాబాద్‌లో ఈనెల ఐదో తేదీ నుంచి ఏడో తేదీ వరకు జరిగిన ధ్యాన దసరా ఉత్సవాలకు హాజరుకావాలని కలెక్టర్ శివశంకర్‌ను శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి పిరమిడ్ మహాక్షేత్రం సభ్యులు ఆహ్వానించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయనను సభ్యులు సత్కరించి ఆహ్వాన పత్రిక అందించారు. సతీష్, అనిల్‌కుమార్, సుదీప్తి, ప్రత్యూష, ఓబయ్య, జయలక్ష్మి, సృజనాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల ఏర్పాటుకు సన్నాహాలు

ప్రైవేటు సంస్థలు ముందుకు రావాలని ఆహ్వానం



మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, పక్కన నాయకులు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే : ప్రొద్దుటూరులో వైద్య కళాశాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి పేర్కొన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళాశాల ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబునాయుడును పలుమార్లు కోరామన్నారు. గత ప్రభుత్వంలోనే ప్రొద్దుటూరుకు రావాల్సిన కళాశాలను మాజీ ముఖ్యమంత్రి జగన్ అనాలోచితంగా పులివెందులకు తరలించారని విమర్శించారు. నాయకులు ఘంటశాల వెంకటేశ్వర్లు, కామిశెట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌పై దాడి

ఖాజీపేట, న్యూస్‌టుడే: ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపల్‌పై ఓ వ్యక్తి దాడి చేసిన సంఘటన మంగళవారం ఖాజీపేటలో చోటు చేసుకుంది. ప్రిన్సిపల్ వివరాల మేరకు.. ఖాజీపేట ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ విజయనరసింహ పాఠశాల వదిలిన సమయంలో విద్యార్థులను బస్సు ఎక్కిస్తుండగా.. బుడ్డాయపల్లెకు చెందిన చక్రధర్ అనే వ్యక్తి మద్యం మత్తులో అక్కడికి చేరుకుని ప్రిన్సిపల్‌తో వాగ్వాదానికి దిగాడు. మాటామాటా పెరిగి ప్రిన్సిపల్‌పై దాడి చేశాడు. దాడి సంఘటనపై ప్రిన్సిపల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. దాడి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ప్రిన్సిపల్ విజయనరసింహ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

బి.కోడూరు (న్యూస్‌టుడే) : జిల్లా స్థాయిలో జరిగిన డిస్కస్ త్రో అండర్-14 బాలుర విభాగంలో బి.కోడూరు మండలం గోవిందాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ రఫీ మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రధానోపాధ్యాయుడు పుల్లయ్య, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఖాదర్ బాషా, ఉపాధ్యాయుడు రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.



షేక్ రఫీని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు పుల్లయ్య, ఉపాధ్యాయులు

ఎగ్జిబిషన్‌లో మూత్రశాలల ఏర్పాటుకు వినతి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఉచిత మూత్రశాల, మూత్రవిసర్జన వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ రఘునాథరెడ్డికి రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్, పిడిఎస్‌యు రాష్ట్ర కన్వీనర్ ఓబులేసులు వినతిపత్రాన్ని అందచేశారు. మహిళలకు అసౌకర్యం లేకుండా ఉచిత మూత్రశాలను ఏర్పాటు చేయాలన్నారు. బాలికల వసతి గృహం, ఉన్నత పాఠశాలలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి ...

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంగళవారం భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు బీపీ వెంకట ప్రతాపరెడ్డి, అసైన్‌మెంట్ కమిటీ పూర్వ సభ్యుడు అంకిరెడ్డిపల్లె నారాయణరెడ్డి తదితరులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లెలో మంత్రిని కలిసి ప్రయాణికుల సమస్యలపై ఈనాడులో ప్రచురితమైన కథనాలను ప్రస్తావించారు.

రోడ్డుపై రోలర్.. చోదకులకు ఫికర్



రహదారిపై నిలిపిన వాహనాలతో జరిగిన రోడ్డు ప్రమాదాలు అనేకం. ముందుచూపుతో వ్యవహరిస్తే ప్రమాదాలను నివారించవచ్చు. ఈ విషయం పోలీసులకు తెలియందేమీ కాకపోయినా మైదుకూరులో పోలీస్‌స్టేషన్ పక్కనే రోడ్డు ప్రమాదంతో స్వాధీనం చేసుకున్న రోడ్డురోలర్ రహదారి పక్కనే నిలిపారు. ప్రమాదాలకు తావివ్వకుండా పోలీస్‌స్టేషన్ వద్ద రహదారి పక్కన నిలిపిన రోడ్డు రోలర్‌ను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. సీఐ సయ్యద్ హసంను వివరణ కోరగా రోడ్డురోలర్‌ను పక్కన పెట్టించేలా చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, మైదుకూరు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బద్వేలు, న్యూస్‌టుడే: పట్టణంలోని మైదుకూరురోడ్డు టీఎంఆర్ షాపు సమీపంలో మంగళవారం రాత్రి 40 ఏళ్లు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. దారిన వెళ్లే స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సచివాలయ ఉద్యోగులకు గాయాలు

బి.కోడూరు (న్యూస్‌టుడే) : బి.కోడూరులో పింఛన్ల పంపిణీకి వెళుతున్న సచివాలయ ఉద్యోగులు గాయపడినట్లు స్థానికులు తెలిపారు. మంగళవారం ఉదయం అయిదు గంటల సమయంలో సచివాలయ సిబ్బంది అఫ్రీది, నరసింహులు ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఆనంవారిపల్లె వద్ద వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో వారిద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను ఎంపీడీవో, సచివాలయ సిబ్బందిని పరామర్శించారు.

వాహనాల స్వాధీనం

రాజుపాలెం, న్యూస్‌టుడే: మండలంలో అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు, జేసీబీ స్వాధీనం చేసుకొని నలుగురు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

మద్యం మత్తు...ఆగిన పింఛన్లు

కాశినాయన, న్యూస్‌టుడే: గొంటువారి పల్లె వీఆర్వో నాయబ్ రసూల్‌ను 85 పింఛన్లను పంచాలని మండల అధికారులు ఆదేశించారు. దీంతో ఆయన మంగళవారం మధ్యాహ్నం వరకు 50 మందికి ఇచ్చి మిగతా 35 మంది డబ్బులు తన వద్దే ఉంచుకొని గొంటువారిపల్లె పాత సచివాలయ భవనంలో మద్యం మత్తులోకి జారుకున్నాడు. దీంతో గొంటువారిపల్లె గ్రామ వీఆర్వో పింఛన్లు పంచడంలో పూర్తిగా వెనుకబడ్డాడని జిల్లా అధికారులు మండల అధికారులకు సమాచారమివ్వడంతో అక్కడకు వెళ్లిన మండల పరిషత్ కార్యాలయ సిబ్బందిపై దురుసుగా మాట్లాడాడని వారు వెనుదిరిగారు. సాయంత్రం రెవెన్యూ, మండల పరిషత్తు కార్యాలయ అధికారులు అక్కడకు వెళ్లి తన దగ్గర ఉన్న డబ్బులు స్వాధీనం చేసుకుని ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌తో పంపిణీ చేశారు.

ప్రొద్దుటూరులో పార్కింగ్ ప్రాంతాల ఏర్పాటు

❖ ఎర్రగుంట్ల కూడలి నుంచి వాహనాలకు నో ఎంట్రీ ❖ డీఎస్పీ భక్తవత్సలం వెల్లడి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు దసరా ఉత్సవాలకు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ భక్తవత్సలం అన్నారు. మంగళవారం డీఎస్పీ అమ్మవారిశాల, శివాలయం, చెన్నకేశవస్వామి దేవాలయం తదితర ఆలయాలను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాలకు 600 మంది సివిల్, 35 మంది ఏఆర్ పోలీసులను వినియోగిస్తున్నామన్నారు. ఎర్రగుంట్ల కూడలి నుంచి వచ్చే వాహనాలను పట్టణంలోకి రానివ్వడం లేదన్నారు. అమ్మవారిశాలకు వచ్చే వాహనదారులకు వృద్ధాశ్రమం, కొవ్వూరు గ్యారేజీ ప్రాంతాల్లో పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. దొంగతనాలను నివారించేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శమి దర్శనం సందర్భంగా జిల్లా నుంచి ప్రత్యేక పోలీస్ బలగాలను తెప్పించనున్నట్లు చెప్పారు. ఆలయ నిర్వాహకులు పోలీస్‌శాఖకు సహకరించాలన్నారు. సీఐలు యుగంధర్, గోవిందరెడ్డి, రామకృష్ణారెడ్డి ఉన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ భక్తవత్సలం

వైకాపా పాలనలో కబ్జాలపై శ్వేతపత్రం ఇవ్వాలి

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన భూకబ్జాలపై నియోజకవర్గాల వారీగా ఎన్డీఏ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య కాలనీలో సీపీఎం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విఫలం చెందారని ఆరోపించారు. బద్వేలు పురపాలికలో పేదలు నివసిస్తున్న కాలనీల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, చిన్ని, కొండయ్య, బాలమ్మ, శివకుమార్, నాగలక్ష్మి, ఫాతిమా, తదితరులు పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాల నిందితుల అరెస్టు

కొండాపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బెడుదూరు గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలోని ప్రాచీనకాలం నాటి విగ్రహాలు అపహరించిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం తాళ్లప్రొద్దుటూరు ఎస్సై హృషికేశవరెడ్డి వివరాల మేరకు.. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను గత నెల 29వ తేదీ తెల్లవారుజామున బెడుదూరు గ్రామానికి చెందిన రాజు, వెంకటరమణ, కొత్తపల్లె గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య అనే నిందితులు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. చోరీకి పాల్పడిన పురాతన విగ్రహాలను పులివెందుల తదితర ప్రాంతాల్లో విక్రయించడానికి నిందితులు ప్రయత్నించినట్లు తెలిపారు. బెడుదూరు- యనమలచింతల క్రాస్ వద్ద ఉండగా నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద విగ్రహాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

'పర్యావరణ సంహిత' పుస్తకావిష్కరణ

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: పర్యావరణ సంహిత పుస్తకం అందరికీ ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ బండారు శ్రీనివాసులు, కవి, ఉపాధ్యాయుడు అమీర్ కొనియాడారు. మంగళవారం స్థానిక మెయిన్ బజారులోని కోదండ రామాలయంలో రచయిత కొరటమద్ది శర్మ తెలుగు, ఆంగ్ల భాషలో రచించిన పర్యావరణ సంహిత పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. తెలుగు ప్రతిని విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఆంగ్ల ప్రతిని భూతమాపురం సుబ్బారావుకు అందజేశారు. కవి అమీర్ మాట్లాడుతూ తన తండ్రి కమాల్‌సాహెబ్ బతికి ఉన్నప్పుడు ఈ పుస్తకానికి ముందుమాట రాశారన్నారు. కార్యక్రమంలో దర్పణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు తగదు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని చెప్పడం కేవలం రాజకీయ దురుద్దేశమేనని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన జమ్మలమడుగులో విలేకర్లతో మాట్లాడారు. కేవలం జగన్ పేరును దెబ్బ తీసేందుకే అలాంటి నిందారోపణలు చేశారన్నారు. సమావేశంలో వైకాపా నాయకులు గిరిధర్‌రెడ్డి, ఉప్పలపాడు శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: స్వచ్ఛత సేవా పక్షోత్సవాల్లో భాగంగా జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మంగళవారం గ్యారేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీఎం ప్రవీణ్ హాజరై మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ చెప్పిన విధంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంటు డీఎం పెద్దిరాజు, కంబగిరిస్వామి, సుధాకర్, బ్రహ్మం, శివుడు, ఫాజిల్ బాషా తదితరులు పాల్గొన్నారు.



గ్యారేజీలో మొక్కలు నాటుతున్న డీఎం ప్రవీణ్

సీసీ రహదారి పనుల అడ్డగింత

కలసపాడు, న్యూస్‌టుడే : మండలంలోని పుల్లారెడ్డిపల్లెలో మంగళవారం గ్రామసచివాలయానికి వెళ్లే మార్గంలో సీసీ రహదారి ఏర్పాటుకు యంత్రంతో పనులు చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. పేదల ఇళ్ల స్థలాలను తొలగించి సీసీ రహదారి వేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. జిల్లాధికారులు చొరవ తీసుకొని న్యాయం చేయాలని కోరారు.



పుల్లారెడ్డిపల్లెలో పనులను అడ్డుకుంటున్న స్థానికులు

సంపద తయారీ కేంద్రం ప్రారంభం

ముద్దనూరు, న్యూస్‌టుడే: మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మంగళవారం పునఃప్రారంభించినట్లు ఎంపీడీవో ముకుందారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎన్‌పల్లెరోడ్డులోని ఎస్‌డబ్ల్యూపీసీ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వీరభద్రుడు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో మైదుకూరు రెండో స్థానం

మైదుకూరు, న్యూస్‌టుడే : పింఛన్ల పంపిణీలో మైదుకూరు మండలం రెండో స్థానంలో నిలిచింది. మండలంలో 4645 మంది పింఛన్‌దారులు ఉండగా 4530 మందికి పంపిణీ చేసి 97.52 స్థానంలో నిలిచినట్లు ఎంపీడీవో పి.లక్ష్మీదేవి తెలిపారు.

IN THE HON'BLE COURT OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR : : ANANTHAPURAMU
DRA. No. 88/2024
Between : Shriram Chits (India) Private Ltd., Anantapur - I Branch, Repd by its Manager cum G.P.A. Holder ... DISPUTANT
Vs
K.Eswara Prasad & 4 others ... OPPONENTS
5) V.Sai Srinatha Raju, S/o V.Vijaya Bhaskar Raju, Junior Accountant / LD / Steno, O/o. Sub - Treasury Office, Proddatur, Kadapa (D). R/o D.No. 12/61-2 Up, Sivunimanyam Street, Mydukur, Kadapa (D).
NOTICE TO OPPONENT No.5
డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీ మొత్తం రూ. 4,23,472/- రాబట్టుకొనుటకుగాను మీపై దాఖలు చేసిన దావాలో 5 వ అపోనెంట్ అయిన మీరు హాజరు అగుటకు గాను 09.10.2024వ తేదీన వాయిదా ఉన్నది. పై దినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, O/o ది జిల్లా రిజిస్ట్రార్ (R&S), అనంతపురం వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు ఉన్న తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.
By order of Dy. Registrar of Chits O/o The District Registrar (R & S) Anantapuramu.

మూతపడిన మద్యం దుకాణాలు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎనిమిది ప్రభుత్వ మద్యం దుకాణాలు సాయంత్రం వరకు మూతపడ్డాయి. ఉద్యోగ భద్రత కల్పించాలంటూ సిబ్బంది మంగళవారం నిరసన తెలియజేస్తూ మద్యం దుకాణాలను తెరవలేదు. సెప్టెంబరు 30వ తేదీ నాటికి ప్రభుత్వ మద్యం దుకాణాలకు గడువు ముగిసింది. ఈ నెల 12వ తేదీ నుంచి కొత్త మద్యం షాపులు రానున్నాయి. అవి వస్తే తమ పరిస్థితి ఏమిటని కాంట్రాక్టు సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై జమ్మలమడుగు ఎక్సైజ్ సీఐ సరితారెడ్డిని వివరణ కోరగా సాయంత్రం 5 గంటల నుంచి పట్టణంలోని ఎనిమిది మద్యం షాపులు తెరచుకున్నాయని చెప్పారు.

30 పోలీస్ యాక్టు అమలు

ప్రొద్దుటూరు నేరవార్తలు, ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఈనెల 1 నుంచి 31 వరకూ ప్రొద్దుటూరు, జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలో 30వ పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలం, జమ్మలమడుగు బాధ్య డీఎస్పీ మురళీనాయక్ వేర్వేరుగా తెలిపారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలకు 24 గంటలు ముందు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. అమనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు.

అలరించిన బాలల వేషధారణలు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీవైష్ణవి పాఠశాలలో కరస్పాండెంట్ రామకృష్ణ ఆధ్వర్యంలో ముందస్తు దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ వేషధారణలతో విద్యార్థులు దసరా ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలు ఎంతో అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కల్యాణి, వైస్ ప్రిన్సిపల్ నమిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోరుమామిళ్లలో వేడుకలను నిర్వహిస్తున్న విద్యార్థులు

భావితరాలకు సంస్కృతి సంప్రదాయాలు అందాలి

ప్రొద్దుటూరు పట్టణం: భావితరాలకు భారతీయ సంస్కృతి సంప్రదాయాలు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని ఆర్యవైశ్య సభ పట్టణ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు, లయన్ మాజీ గవర్నర్ జొన్నలగడ్డ రామచంద్రప్రకాష్ అన్నారు. అమ్మవారిశాలలో భారత జాతీయ కళా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటెక్) ఆధ్వర్యంలో 'మన చరిత' ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



ముందస్తు దసరా వేడుకల్లో విద్యార్థులు

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: స్థానిక గురవయ్యతోటవీధిలోని శ్రీ రాజీవ్ పాఠశాలలో మంగళవారం ముందస్తు దసరా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రాజేష్, కరస్పాండెంట్ సుధాకర్ మాట్లాడారు. పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. దేవీనవరాత్రులకు సంబంధించిన వేషధారణల్లో విద్యార్థులు ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టెస్సీ, ఉపాధ్యాయులు సుధా, ప్రియాంక, రాధిక, పద్మావతి, మస్తాన్‌బీ, సల్మా, దయానా, ప్రసన్న, శిరీష, రహమతున్నీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక

అట్లూరు, న్యూస్‌టుడే : రాయచోటిలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి కుస్తీ పోటీల్లో అట్లూరు ఉన్నత పాఠశాలకు చెందిన రాంచరణ్, విష్ణువర్ధన్ సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం ఎంఈవో ఖాదర్‌వల్లి, ప్రధానోపాధ్యాయుడు అశ్వర్థరెడ్డి తదితరులు విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా నా కక్షిదారుడు అయిన పుట్టా వెంకటరమణయ్య కుమారుడు అయిన పుట్టా వాసుదేవ రావు హైదరాబాదులో నివశించు A-G4, Asbestos Staff Quarters, Czech Colony, Sanath Nagar గారి instructions మేరకు ఇచ్చు బహిరంగ ప్రకటన ఏమనగా,

క్రింద తెలిపిన షెడ్యూలు ఆస్తి గురించి నా కక్షిదారుడు ప్రొద్దుటూరు సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టు నందు O.S.No. 115/2009 (O.S.No. 373/2008) అను (JCJ Court, Mydukur) (Senior Civil Judge Court) నందు దావాలపైన అపీలు దాఖలు చేసి ఉన్నారు. సదరు అపీలు విషయము దావాలో ప్రతివాదులందరికీ తెలిసిన విషయమే. అపీలు పెండింగ్ కాలము నందు ప్రతివాదులు క్రింద షెడ్యూలు దాఖలా ఆస్తిని కానీ అందులోని ఏ భాగమైననూ అమ్మిననూ కొన్నవారికి ఎటువంటి హక్కులు సంక్రమించవు. కానీ కొందరు వ్యక్తులు క్రింద షెడ్యూలు దాఖలా ఆస్తిని తమదని తెలుపుతూ అన్యాక్రాంతము చేయుటకు యత్నించుచున్నారు. అట్లు కొనినను మా కక్షిదారుని యొక్క హక్కు భుక్తమునకు ఏలాంటి హాని వాటిల్లదని ఈ ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము.

షెడ్యూలు

1) కడప డిస్ట్రిక్ట్, మైదుకూరు మండలం, నంద్యాలంపేట గ్రామ పంచాయతీ జమీనులోని నెంబరు వారి వివరం మరియు మైదుకూరు Sub-District, Mydukur Mandal, నంద్యాలంపేట 1) S.No. 322/1ప ఐటములో 1 ఎకరా 66 సెంట్లు పూరా మరియు 2) S.No. 315/8, 0.16 సెంట్లు పూరా మరియు బావిలో పూరా హక్కు.

శ్రీ జి.కృష్ణకుమార్, B.Com, B.L., శ్రీమతి వై.వేదశ్రీ, B.A, LL.B., 5/323, బ్రాహ్మిణ్ స్ట్రీట్, ఆంజనేయస్వామి టెంపుల్ స్ట్రీట్, కడప - 516001.

కడప

•కడప •పులివెందుల •కమలాపురం

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం


పులివెందులలో ప్రజల సమస్యలు ఆలకిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల (వేంపల్లె): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందులలోని ఆయన నివాసం వద్ద మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు, కార్యకర్తలు ఆయనను కలిసి సమస్యలు వివరించారు. ఇళ్ల స్థలాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్సీని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పీజీ వైద్య విద్యార్థుల ప్రతిభ


అవార్డులు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్ సురేఖ

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: తిరుపతిలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి మత్తువైద్యుల సదస్సులో రిమ్స్ పీజీ వైద్య విద్యార్థులు ఉత్తమ అవార్డులు సాధించడం రిమ్స్ ఆసుపత్రి, వైద్య కళాశాలలకు ఎంతో గర్వకారణమని ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ తెలిపారు. స్థానిక వైద్య కళాశాలలో మంగళవారం పీజీ విద్యార్థులు పూజ, శ్రీకావ్య, రాంమూర్తి, సంధ్యారాణి, శ్రీలేఖ, ఔత్రి, సందీప్‌లను అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, మత్తువైద్య విభాగం వైద్యులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


ప్రదర్శన తిలకిస్తున్న వీసీ ఆచార్య కృష్ణారెడ్డి, అధ్యాపకులు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు వైల్డ్ హార్ట్స్ బై ఫైన్ ఆర్ట్స్ అనే సేవా సంస్థ కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి హాజరై విద్యార్థినులను అభినందించారు. వివిధ వంటకాలు, హస్తకళలు, డెవిల్ హౌస్, సినిమా థియేటర్, డిస్కో, డ్యాన్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన డబ్బును సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు విద్యార్థినులు తెలిపారు.

30 పోలీసు యాక్టు అమలు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప పోలీసు సబ్ డివిజన్ పరిధిలో అక్టోబరు 31 వరకు 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని కడప బాధ్య డీఎస్పీ రమాకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేయాలనుకుంటే 24 గంటల ముందు రాతపూర్వకంగా అర్జీ ఇచ్చి అనుమతి తీసుకోవాలన్నారు.

రౌడీషీటర్ అరెస్టు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఓ మహిళ ఇంట్లో వంట చేస్తుండగా, అదే ప్రాంతానికి చెందిన రాజ్‌కుమార్ అనే రౌడీషీటర్ ఇంట్లోకి వెళ్లి ఆమెపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలిచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

వేధింపులపై కేసు నమోదు: కడప తాలూకా ఠాణా పరిధిలో వేధింపుల ఘటనలో అయిదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కడప చెమ్ముమియాపేటకు చెందిన రాజేశ్వరికి కిరణ్‌కుమార్ అనే వ్యక్తితో ఏడాది కిందట వివాహమైంది. వీరిద్దరూ రామాపురం మండల పరిధిలోని సచివాలయ కార్యదర్శులుగా పనిచేస్తున్నారు. కొంత కాలం నుంచి భర్త అధిక కట్నం కోసం వేధిస్తున్నాడని రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిరణ్‌కుమార్‌తో పాటు అయిదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం మండలం కనుమలోపల్లిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కడప నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సు కనుమలోపల్లె వద్దకు రాగానే ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో పెనగలూరు మండలానికి చెందిన ఆటో చోదకుడు రామచంద్రయ్య, ఆటోలో ప్రయాణిస్తున్న నరసమ్మ గాయపడ్డారు. వారిని కడప సర్వజన ఆసుపత్రికి తరలించారు.

రైతులకు మినుము విత్తనాల పంపిణీ

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు ఎల్‌బీజీ-904 రకం మినుము విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త వీరయ్య మాట్లాడుతూ మినుము పంటలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఇన్‌ఛార్జి జిల్లా వ్యవసాయాధికారి రమణారెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

యువతరం... సేవామార్గం

న్యూస్‌టుడే, వైవీయూ (కడప)

విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా సామాజిక సేవ వైపు అడుగులు వేస్తున్నారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని అన్ని విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు పలు స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామాలను దత్తత తీసుకుని రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రక్తదానం, ఆరోగ్యవిద్య, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంపై అవగాహన కల్పించారు. దత్తత గ్రామాలకు సహకారం అందిస్తున్నారు. విద్యార్థులు స్ఫూర్తిదాయక సేవలందించి ప్రశంసలు అందుకుంటున్నారు.


యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని పలు ఎన్ఎస్ఎస్ యూనిట్లకు సంబంధించి వాలంటీర్లు సమాజసేవే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

గ్రామాన్ని దత్తత తీసుకుని...

ఏటా ఓ గ్రామాన్ని దత్తత తీసుకుని, అక్కడ ఏడు రోజుల పాటు కార్యక్రమాలు చేపడుతున్నారు. మొక్కలు నాటి కంచె ఏర్పాటు, పాఠశాలలను సుందరంగా తీర్చి దిద్దడంతో పాటు, మత్తు పదార్థాలు, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పెండ్లిమర్రి మండలం శివాజీనగర్, ఇసుకపల్లి గ్రామంలో స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టి గ్రామస్థుల్లో చైతన్యం నింపారు.



వరద బాధితులకు చేయూత

ఇటీవల విజయవాడలో వరద బాధితులకు మేమున్నామంటూ ముందుకు వచ్చారు పులివెందుల లయోలా డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు. కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో కల్యాణి నేతృత్వంలో విద్యార్థులు పట్టణంలోని పలువురు నుంచి నిత్యావసరాలు, దుస్తులు, ఇతర వస్తువులు సేకరించి బాధితులకు అందించాలని వైవీయూ అధికారులకు ఇచ్చారు. దీంతో పాటు పట్టణంలో ముఖ్యమైన ప్రాంతాల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించి స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం

కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నగరంలో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టారు. నాగరాజుపేటలోని పలు ప్రాంతాల్లో వ్యర్థాలు తొలగించారు. ఇంటితో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే, ఆరోగ్యంగా ఉండొచ్చంటూ స్థానికులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.





ప్లాస్టిక్‌పై సమరం

కడప ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పదిహేను రోజుల పాటు ప్లాస్టిక్‌పై యుద్ధభేరి మోగించారు. దీనిని నివారించకపోతే మానవాళి అనేక దుష్ప్రభావాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్లాస్టిక్ వాడకాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. కళాశాలతో పాటు, రైల్వే స్టేషన్, రిమ్స్ రోడ్డు ప్రాంతంలో వ్యర్థాలను తొలగించారు.

రేపటి నుంచి దసరా ఉత్సవాలు


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కమిటీ ఛైర్మన్ పీవీరమణ, సభ్యులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: స్థానిక అమ్మవారిశాలలో వెలసిన శ్రీవాసవీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో 3 నుంచి 13వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవాల కమిటీ ఛైర్మన్ పీవీ రమణ మంగళవారం తెలిపారు. ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మవారిని ప్రతిరోజు ప్రత్యేకంగా అలంకరిస్తారని వెల్లడించారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మారుతీనగర్: స్థానిక విజయదుర్గ ఆలయంలో 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు దసరా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపకులు దుర్గా మల్లికార్జునరావు, కార్యనిర్వాహకులు దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు, పూజలు ఉంటాయన్నారు.

తెదేపా నాయకుడి మృతికి సంతాపం

చక్రాయపేట, న్యూస్‌టుడే : మండల పరిధి చిలేకాంపల్లెలోని పెద్దూరుకు చెందిన తెదేపా నాయకుడు రామలింగారెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారు. చక్రాయపేట తెదేపా మండల బాధ్యుడు మహేశ్వర్‌రెడ్డి, తెదేపా సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి తదితరులు మంగళవారం ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పాఠశాలల్లో దసరా ముందస్తు వేడుకలు

పాఠశాలల్లో మంగళవారం దసరా ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు అమ్మవారి వేషధారణల్లో అలరించారు. నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. పండగ విశిష్టతను వక్తలు వివరించారు. **- న్యూస్‌టుడే బృందం**


వేంపల్లె శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో చిన్నారుల నృత్యం


కడప నాగార్జున మోడల్ స్కూల్‌లో...


కమలాపురం సూర్య ఉన్నత పాఠశాలలో...


సిద్దవటం శ్రీ సాయి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

వేముల, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయిలో జరిగే సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు వి.కొత్తపల్లె ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. రాయచోటిలో జరిగిన పోటీల్లో అండర్-17 సాఫ్ట్‌బాల్ లో గంగాదేవి, అంజలి, అండర్-14లో అనూష, వైష్ణవి, ఉష, రాజకుళ్లాయప్ప, రాహుల్ ఎంపికయ్యారు. అండర్-17 బేస్‌బాల్‌లో అంజలి, గంగాదేవి, అండర్-14లో వైష్ణవి, అనూష, ఉష, ధనుష్, సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ విభాగంలో గంగాదేవి ఎంపికయ్యారని చెప్పారు.

వేంపల్లెలో దుకాణ సముదాయాల తొలగింపు

వేంపల్లె, న్యూస్‌టుడే : వేంపల్లె ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని దుకాణ సముదాయాన్ని అధికారులు మంగళవారం తొలగించారు. డీవోటీ పథకం కింద పట్టణానికి చెందిన ఇరువురు రూ.2 లక్షలు డిపాజిట్ చేయడంతో ఆర్టీసీ అధికారులు 20 ఏళ్ల కిందట దుకాణ సముదాయాన్ని నిర్మించారు. గత వైకాపా హయంలో రూ.3 కోట్లతో ఆర్టీసీ బస్‌స్టేషన్ పునర్నిర్మించారు. ఈ సముదాయం బస్‌స్టేషన్‌కు అడ్డంకిగా మారింది. ఈ క్రమంలో దీన్ని తొలగించవద్దని కోర్టుమెట్లు ఎక్కారు. సదరు దుకాణదారుల గడువు ముగియడంతో ఆర్టీసీ అధికారులు సముదాయాన్ని కూల్చివేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సముదాయాన్ని కూల్చివేయడం అన్యాయమని బాధితులు వాపోతున్నారు.

రక్తదానం... అభినందనీయం


రక్తదాతలను పరామర్శిస్తున్న డీజీఎం సుమన్‌సర్కార్, ఎస్ఎంఎస్ చీఫ్ విజిలెన్స్ అధికారి ఖలీల్‌సౌథాగర్

వైవీయూ (కడప): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బోగాపార్వతమ్మ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆర్.వీర సుదర్శనరెడ్డి పేర్కొన్నారు. మొత్తం 80 మంది రక్తదానం చేశారు. వైస్ ఛైర్మన్లు ప్రకాశ్, ప్రదీప్, ఎన్ఎస్ఎస్ పీవో వై.నాగేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైవీయూ (కడప): జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని కడప నగరం కోటిరెడ్డి కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 మంది విద్యార్థినులు రక్తదానం చేశారు. ప్రిన్సిపల్ వి.సలీంబాషా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎస్‌వో శివశంకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవోలు జి.విజయలక్ష్మీదేవి, స్వరూప, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వేముల: ఎం.తుమ్మలపల్లె యురేనియం పరిశ్రమ ప్రాథమిక వైద్యశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డీజీఎం సుమన్‌సర్కార్, ఎస్ఎంఎస్ చీఫ్ విజిలెన్స్ అధికారి ఖలీల్‌సౌథాగర్ ప్రారంభించారు. యూసీఐఎల్, ఏపీఎస్‌పీఎఫ్ సిబ్బంది రక్తదానం చేశారు. పరిశ్రమ ముఖ్య అధికారి సంజయ్ ఛటర్జీ, సీఎస్ఆర్ పర్యవేక్షణాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట


వృద్ధుడికి పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే మాధవి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారని, అందుకోసమే ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు అందిస్తున్నారని కడప ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఐదు, మూడో డివిజన్ పరిధిలోని చలమారెడ్డిపల్లెలో ఆమె వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఐదో డివిజన్ పరిధిలోని మసీదు వద్ద చౌకదుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. నగరంలోని పలుప్రాంతాల్లో తెదేపా నాయకులు పింఛన్లు అందజేశారు.

జీవనోపాదుల మెరుగునకు ప్రభుత్వం చర్యలు: కడప గ్రామీణ: పొదుపు సంఘ సభ్యుల జీవనోపాదుల మెరుగునకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని శాసనసభ్యురాలు మాధవిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాజీవ్ పార్కు వద్ద మెప్మా పట్టణ మార్కెట్ పేరుతో పొదుపు సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆమె ప్రారంభించారు. మెప్మా నగర మేనేజరు రాజేశ్వరి, సీఓలు, సీఎల్ఆర్పీలు, ఆర్పీలు, సిబ్బంది, పొదుపు సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలి : కడప నగరపాలక: ప్లాస్టిక్ వినియోగంతో గాలి, నీరు, భూమి, ఆకాశం కలుషితమవుతున్నాయని, దీనిని అరికట్టడానికి ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే మాధవి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో హౌసింగ్‌బోర్డు కాలనీలోని రాజీవ్ పార్కు వద్ద స్వచ్ఛతా హీసేవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కడప నగరవాసులు ప్లాస్టిక్ వినియోగాన్ని బహిష్కరించాలని పిలుపునిచ్చారు. తదనంతరం ప్లాస్టిక్ వ్యర్థాలను నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లలో అప్పగించిన వారికి బహుమతులు అందించారు. నగరపాలక కమిషనర్ నందన్, అదనపు కమిషనర్ రాకేశ్‌చంద్రం, వైద్యాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వాగతోత్సవం


ఆకట్టుకున్న విద్యార్థిని నృత్యం

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: కడప నగర శివారులోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన స్వాగతోత్సవ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి యోగి వేమన విశ్వవిద్యాలయం జువాలజీ శాఖ ఆచార్యులు డాక్టర్ ఎస్పీ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన చదువుతోనే ఉన్నత శిఖరాలకు వెళతారన్నారు. కళాశాల ఛైర్మన్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ సీనియర్స్ కొత్త విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇస్తూ సరైన మార్గ నిర్దేశం చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛను తీసుకుని వెళుతూ మహిళ మృతి

వేంపల్లె, న్యూస్‌టుడే : మండలంలోని పాములూరులో మంగళవారం పింఛను డబ్బులు తీసుకునేందుకు వచ్చిన భోగపతి రాజ్యలక్ష్మి (50) అనే మహిళ గుండెపోటుతో మృతి చెందారు. అమ్మగారిపల్లెకు చెందిన ఆమె భర్త లక్ష్మీరెడ్డి కొన్నేళ్ల కిందట మృతి చెందారు. ఆమె వేంపల్లెలోని రాజీవ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పింఛను కోసం ఉదయాన్నే పాములూరు సచివాలయానికి వెళ్లారు. పింఛను డబ్బులు తీసుకుని వేంపల్లెకు వచ్చేందుకు బయటకు రాగానే గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఆమె మృతదేహాన్ని అమ్మగారిపల్లెకు తీసుకెళ్లి బంధువులకు అప్పగించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: వైవీయూ జాతీయ సేవా పథకం యూనిట్-8 పీవో డాక్టర్ సుమిత్ర ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. వర్సిటీలో పాత సైన్స్ విభాగం పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని పలువురు పేర్కొన్నారు.

◆ కడప నగర శివారులోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. బాధ్య రిజిస్ట్రార్ ఎన్.రాజేష్‌కుమార్‌రెడ్డి, పీవోలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

◆ యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవ పథకం యూనిట్-2 పీవో డాక్టర్ ఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో సైన్స్ విభాగం పరిసరాల్లో పిచ్చి మొక్కలను, ప్లాస్టిక్ పేపర్లను వాలంటీర్లు తొలగించారు.

◆ గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఇందుకోసం అందరూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ జి.రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులందరూ కలిసి మానవహారంగా నిలబడి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు.

కమలాపురం: స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు.

◆ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని సీఐ రోషన్, నగర పంచాయతీ కమిషనర్ జగన్నాథ్ పేర్కొన్నారు. మంగళవారం కడప శాఖ నెహ్రూ యువకేంద్రం, మదర్‌థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక వివేకానంద ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులు స్థానిక కోర్టు, పోలీసుస్టేషన్, తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు.

పులివెందుల(వేంపల్లె): విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని పులివెందుల ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధర పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్రం, స్నేహిత అమృతహస్తం సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.


కమలాపురంలో ప్రతిజ్ఞ చేస్తు న్న విద్యార్థులు